శాతవాహనుల సంస్కృతి పరిపాలన, సామాజిక స్వరూపం

మౌర్య సామ్రాజ్యం పతనానంతరం, వాయవ్య భారతదేశంలో కుషాణులు, పశ్చిమ భారతదేశంలో క్షాత్రపులు, దక్షిణా పథంలో శాతవాహనులు, ప్రాచీన చోళులు, స్వతంత్ర రాజ్యాలను స్థాపించుకున్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశ సంస్కృతికి వారధిగా నిలిచిన శాతవాహనులు సుమారు నాలుగు శతాబ్దాల పాటు పాలించారు. శాతవాహనులకు పూర్వమే దక్షిణాపథంలో నాగ, యక్ష వంటి అనేక తెగల ప్రజలు స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. కాలక్రమంగా ఇతర తెగలతో సమ్మిళితమై ఆంధ్ర జాతిగా రూపొందారు. తొలి చారిత్రక యుగం నుంచి దేశీయ, విదేశీ వాణిజ్యం అభివృద్ధి చెందిందని... శాసనాలు, నాణేలు, పురావస్తు అవశేషాల వంటి ఆధారాలు తెలియజేస్తున్నాయి. మతపరంగా వైదిక, బౌద్ధ, జైన విశ్వాసాలు ప్రాచుర్యం పొందాయి. మహా సాంఘికవాదం బలపడి అమరావతి, నాగార్జునకొండ ప్రాంతాలు ధార్మిక కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. ఆనాటి మత, సాంఘిక వ్యవస్థ కట్టడాలు, శిల్పాలు, శాసనాల్లో ప్రతిబింబించింది. ఈ కాలంలో ప్రాకృత, సంస్కృత, దేశీ భాషలు, బ్రాహ్మీ లిపి అభివృద్ధి చెందాయి. తత్ఫలితంగా విద్య, సాహిత్యం పురోగతిని సాధించాయి.

ప్రాచీనాంధ్ర దేశం శాతవాహన యుగంలో పశ్చిమాన రోమన్ సామ్రాజ్యంతో విస్తృతంగా వర్తక వాణిజ్యాలు నిర్వహించింది. ఆగ్నేయాసియాలోని బర్మా, జావా, కంబోడియా మొదలైన దేశాల్లో జనవాసాలు నెలకొల్పి, భారతీయ నాగరికత సంస్కృతులను విస్తరింపజేసింది. ప్రాచీనాంధ్ర తీర ప్రాంతంలో అనేక రేవు పట్టణాల ద్వారా వర్తక-వాణిజ్యాలు జరిగేవని క్రీస్తు శకారంభం నాటి గ్రీకు రచనలు స్పష్టం చేస్తున్నాయి. ఇవి ఆనాటి వ్యవసాయ పద్ధతులనూ తెలుపుతున్నాయి. ప్రాచీన గ్రీకు భూగోళ గ్రంథాలు, యాత్రా కథనాలు (Travelogues) కాకుండా... అమరావతి, నాగార్జునకొండ, జగ్గయ్యపేట, ఫణిగిరి, చందవరం, తొట్లకొండ, బావికొండ, శంకరం ధూళికట్ట మొదలైన ప్రాంతాల్లో లభించిన పురావస్తు అవశేషాలు, నాణేలు, లేఖనాలు ఆనాటి సమకాలీన వ్యవసాయాభివృద్ధిని, వర్తక వాణిజ్యాల ఔన్నత్యాన్ని, ఆర్థికాభివృద్ధిని మత, సాంఘిక పరమైన అంశాలను అవగాహన చేసుకునేందుకు దోహదపడు తున్నాయి.నాగార్జునకొండ, వినుకొండ, చేబ్రోలు, బాపట్ల మొదలైన ప్రాంతాల్లో రోమన్ బంగారు నాణేలు, మృణ్మయ శకలాలు లభించాయి. మైసోలియా (మచిలీపట్నం), 'కూడూర' (గూడూరు) ప్రధాన వాణిజ్య కేంద్రాలు. ఆ ప్రాంతాల్లో ఎగుమతి-దిగుమతి వ్యాపారం నిర్వహించే రేవు పట్టణాలున్నట్లు తెలుస్తోంది. టాలమీ రచించిన 'భూగోళ శాస్త్రం', ఒక అజ్ఞాత గ్రీకు నావికుని దినచర్యగా లభించిన 'పెరిప్లస్ మారిస్ ఎరిథ్రే 'అనే గ్రంథం 'కంటకొస్సిల' (ఘంటశాల), కొడ్డూర (గూడూరు) రేవు పట్టణాల గురించి తెలియజేశాయి. వీటితో పాటు దక్కను పీఠభూమి పశ్చిమ తీరంలో భరుకచ్ఛ, కల్లియాన (కల్యాణ్), సోపార (శూర్పారక) మొదలైన ప్రసిద్ధ రేవు పట్టణాలను, దేశీయ వర్తక కేంద్రాలను



పేర్కొంటున్నాయి.

వ్యవసాయం ముఖ్య వృత్తి

నాసిక్ గుహాలయంలో గౌతమీ బాలశ్రీ వేయించిన శాసనం, 'దేవీ నాగనిక' వేయించిన నానాఘాట్ శాసనం ద్వారా ఆనాటి మత సాంఘిక పరిస్థితులు తెలుస్తున్నాయి. క్రీ.శ. రెండో శతాబ్దికి చెందిన హాలుని 'గాథాసప్తశతి' శాలి, శ్యామక అనే వరి ధాన్య రకాలను జొన్న, కొర్ర మొదలైన చిరుధాన్యాలను పేర్కొంటుంది. అమరావతి, నాగార్జునకొండ శాసనాల్లో ఖేట, తడాగ, తాలవన వంటి పదాలు తరచుగా కన్పిస్తాయి. ఇవి వ్యవసాయానికి సంబంధించి భూములు తటాకాలు, తాటిచెట్లు వనాలను సూచిస్తున్నాయి. శాతవాహనులకు వ్యవసాయం ముఖ్య వృత్తి. మౌర్యుల కాలం నాటి అర్థశాస్త్రంలో కౌటిల్యుడు (చాణుక్యుడు) దక్షిణ భారతదేశంలో విలువైన గవ్వలు, వజ్రాలు, ముత్యాలు, వైఢూర్యాలు, బంగారం సమృద్ధిగా లభిస్తాయని పేర్కొన్నాడు. బరిగాజ (భరుకచ్ఛ) నేటి బ్రోచ్ నుంచి, ఇటలీ, అరేబియా దేశాల్లో లభించే 'మద్యం, రాగి, సీసం, తగరం, పగడాలు, వస్త్రాలను' భారత దేశం దిగుమతి చేసుకునేది. అదే విధంగా అంతకు అనేక రెట్లు విలువైన దంతం, రత్నాలు, వైఢూర్యాలు, పింగాణీ, నూలు, పట్టు వస్త్రాలు, దారం, వనమూలికలు గంధపు చెక్కలు మొదలైన వస్తు సామాగ్రిని ఎగుమతి చేసేదని 'పెరిప్లస్ ఎరిత్రియన్‌సీ' పేర్కొంటుంది.

శాతవాహనుల కాలంలో బౌద్ధ విహారాలకు, మహాచైత్యాల నిర్మాణాల కోసం వివిధ వృత్తులు, పరిశ్రమలకు చెందినవారు, వర్తకులు, విరివిగా విరాళాలు, దానధర్మాలు చేసినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ధనకటక-అమరావతి, నాగార్జునకొండ శాసనాల్లో 'నిగమ' గోఠి అనే పదాలు విరివిగా కన్పిస్తాయి. అవి వర్తకులు, అనేక వృత్తుల పనివాళ్లు ఏర్పరచుకున్న స్వయం పాలక సంఘాలని తెలుస్తుంది. అవి తమ సభ్యులను సమష్టిగా సహకార భావంతో మందుకు తీసుకెళ్తూ.. పట్టణాలు గ్రామాలను సైతం పాలించుకున్నట్లు సింహ గోష్టికి అధిపతైన కుభీరకుని 'రాజ బిరుదం' సూచిస్తుంది. ఈ విధంగా అనేక వృత్తుల వారు స్వయంపాలక సంఘాలు, శ్రేణులుగా ఏర్పడినట్లు శాసనాలు విశదపరుస్తున్నాయి. ఈ చారిత్రక నేపథ్యంలో శాతవాహనులు, వారి పరిపాలన, ఆర్థిక సామాజిక, మత, సాహిత్యవికాసం, వాణి

జ్యాలు, శిల్పం-వాస్తు నిర్మాణాలు గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

శాతవాహనుల పరిపాలనా విధానం

'దక్షిణ భారతదేశ చరిత్ర' సుస్పష్టమైన చారిత్రక ఆధారాలతో శాతవాహనుల కాలం నుంచే ప్రారంభమయింది. వీరు పరిపాలనలో మౌర్యులను అనుకరించారు. మనుధర్మశాస్త్రం, మౌర్యుల కాలం నాటి చాణుక్యుని 'అర్థశాస్త్రం' వంటి గ్రంథాలు మార్గదర్శకాలయ్యాయి. వీరి కాలం నాటికి రాజు దైవాంశ సంభూతుడని, రాజ్యాధికారం దైవదత్త మని ప్రజలు విశ్వసించడం వల్ల వారి విశ్వాసాలను 'మనుస్మృతి' వంటి ధర్మశాస్త్ర గ్రంథాలు గ్రంథస్థం చేశారు. రాజధర్మం, ప్రజా విశ్వాసం, భూమిపై సర్వసంపదలపై రాజుకు పూర్తి హక్కులు లభించాయి. తత్ఫలితంగా రాజులు అడవులను నరికి, నీటి సదుపాయం కల్పించి, భూమిని అనుభవించే అవకాశాన్ని ప్రజలకిచ్చి, అందుకు ప్రతిగా సుంకాలను పొందే అధికారం సంక్రమించింది. తొలి శాతవాహన రాజు శాతకర్ణి అశ్వమేధ, రాజసూయ యాగాలు చేసి, సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకున్నాడు. శాతవాహనుల పరిపాలనా పద్ధతి 'వికేంద్రీకృత' వారసత్వ రాజరికంగా ఉండేది. రాజు సర్వాధికారి, నిరంకుశుడు కాదు. వైదిక సంస్కృతిని, వర్ణాశ్రమ ధర్మాలను పాటించారు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు (పురుషార్థాలు) ప్రాధాన్యమిచ్చారు. రాజ్యం వంశపారంపర్యం గా సంక్రమిస్తుంది. రాజుకు పరిపాలనలో కోశాధిపతి, లేఖకుడు, మహాసేనాపతి సలహాదారులుగా ఉండేవారు. ఉత్తర భారతదేశాన్ని పాలించిన కుషాణులు 'మహారాజు, రాజాధిరాజు' వంటి బిరుదులు పొందారు. వీటినే పశ్చిమ ప్రాంత క్షాత్రప రాజులు అనుకరించారు. క్షాత్రపుల నుంచి, శాతవాహనులు కూడా ఇటువంటి బిరుదులు ఆపాదించుకున్నారు. ఉదాహరణ - 'గౌతమీపుత్రశాతకర్ణి' రాజ-రాజ.... (King of Kings) బిరుదు పొందాడు.

శాతవాహన రాజులు పరిపాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని 'ఆహరాలు'గా (రాష్ట్రాలుగా) విభజించారు. ప్రతి 'ఆహర'లో ప్రధాన నగరాన్ని నిగమం అనేవారు. నిగమాలతో పాటు, గ్రామాలుండేవి. 'ఆహరం' అంటే వ్యవసాయ ప్రధా నమైన జనవాసాలతో కూడిన జనపదాలని చెప్పవచ్చు. శాత వాహనుల కాలం నాటి శాసనాల్లో 'గోవర్ధనాహార, మామలా హార, శాతవాహనాహార, సోపారాహారలు పేర్లను వ్యక్తం చేస్తున్నాయి.''ఆహరాలకు' (రాష్ట్రాలకు) అధికారులుగా రాజబంధువులనే 'అమాత్యులు'గా నియమించేవారు. పట్టణ పరిపాలనను ప్రధానంగా వర్తక కేంద్రాలను 'నిగమ సభలు' నిర్వహించేవి. ఈ సభలు రాజుకు సలహాలిచ్చి, పట్టణాభివృద్ధికి తోడ్పడేవి. సోపార, కళ్యాణ్, నాసిక్, పైథాన్, కన్హేరి, కార్లే, గోవర్ధన ధాన్యకటకం, విజయపురి, కొండాపూర్ మొదలైనవి ముఖ్య పట్టణాలు. రాజ్యంలో చివరి పరిపాలనా విభాగాల్లో 'గ్రామణి' గ్రామాధికారిగా వ్యవహరించేవాడు. ఆయన ఆధీనంలో 5 నుంచి 10 గ్రామాల వరకూ ఉండేవి. పట్టణాలు- గ్రామాల పరిపాలన 'స్వయం పరిపాలనా పద్ధతి' మీద ఆధారపడినట్లు కనిపిస్తుంది. కార్లే, కన్హేరి శాసనాల ప్రకారం మహారథీ, మహాభోజులను, శాతవాహనులకు సామంత రాజులుగా పేర్కొంటున్నాయి. వీరికి వంశపారంపర్య రాజ్య హక్కు లేదు. దక్షిణాపథంలో పశ్చిమ దక్కను ప్రాంతాన్ని మహారథీలు, కొంకణ ప్రాంతాన్ని 'మహాభోజులు' పాలించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. కొల్హాపూర్‌లో లభించిన శాతవాహన నాణేల ప్రకారం 'రణో వాసిష్ఠీపుతస విరివాయకురస, రణోమాధవీ పుతస సివలకురస, రణోగౌతమీపుతస విరివాయకురస,' అనే ముగ్గురు శాతవాహన రాజుల పేర్లున్నాయి.

- శాతవాహనుల కాలంలో ప్రాకృత, సంస్కృత, దేశీ భాషలు, బ్రాహ్మీ లిపి అభివృద్ధి చెందాయి. తత్ఫలితంగా విద్య, సాహిత్యం పురోగతి సాధించాయి.
- ప్రాచీనంధ్ర దేశం శాతవాహన యుగంలో పశ్చిమాన రోమన్ సామ్రాజ్యంతో విస్తారమైన వర్తక, వాణిజ్యాలు నిర్వహించింది.
- నాసిక్ గుహాలయంలో బాలశ్రీ వేయించిన శాసనం, దేవీ నాగనిక వేయించిన నానాఘాట్ శాసనం ఆ నాటి మత సాంఘిక పరిస్థితులు తెలుపుతున్నాయి.
- శాతవాహనులు పరిపాలనలో మౌర్యులను అనుకరిం చారు. రాజు సర్వాధికారి. నిరంకుశుడు కాదు. మనుధర్మ శాస్త్రం, చాణక్యుని 'అర్థశాస్త్రం' వీరికి మార్గదర్శకాలు. వైదిక సంస్కృతిని, వర్ణాశ్రమ ధర్మాలను పాటించారు. వ్యవసాయం ముఖ్యవృత్తి.
- కార్లే,కన్హేరీ శాసనాలు మహారథీ, మహాభోజులను శాత వాహనులకు సామంత రాజులుగా పేర్కొంటున్నాయి.